# ఆరామంలో సత్కారం

రెండవ ప్రపంచయుద్ధ సందర్భంలో పట్టాలు పీకివేయగా మిగిలిన కాకినాడ - కోటిపల్లి రైలురోడ్డు ఇసక నేలమీద స్తిమితంగా కూర్చుని సీనియరు స్కూళ్ళ ఇనస్పెక్టరు శ్రీహరిరావుగారు, జూనియర్ రామారావుగారు గుసగుసలాడుకుంటున్నారు.

సాయంత్రం ఆరు గంటలయింది.

నేనూ షికారుగా అటు వెళ్ళాను. నన్ను చూసి చిరునవ్వులతో సంభాషణ ఆపేశారు.

నాకు అనుమానం వేసింది, నాగురించే ఏమో అని.

వేరే ప్రసంగం ప్రారంభించారు.

చాలాసేపు ఖులాసాగా కబుర్లు చెప్పుకున్నాం.

నాకు అనుమానం పీకుతూనే ఉంది.

హఠాత్తుగా మరి పదిరోజులకు శ్రీహరిరావు గారికి ట్రాన్స్ఫర్ అయింది.

మిత్రులమంతా చిన్నబుచ్చుకున్నాం.

వీడ్కోలు సభలు, పార్టీలు, అమోఘంగా జరిగాయి, 'రేంజి' అంతటా— అన్నిటా నేనుకూడా ఉన్నాను, సూదిలో దారంలా—

తలవని తలంపుగా రామారావుగారు మా ఇంటికి వచ్చి 'మీకు

డాక్షారంలో సన్మానం తలపెట్టాం. మీరు అంగీకరించక తప్పదు. మేము ఆనాడు రైలు రోడ్డుమీద కూర్చుని మాట్లాడుతూన్నది, ఆ సంగతే— స్థిరపడితేగాని మీకు చెప్పకూడదని అప్పుడు ప్రసంగం మార్చేశాం. మీరు తెల్లబోయారు.

అయినా చెప్పదలచుకోలేదు.

ఆహ్వానసంఘం ఏర్పడింది.

అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణరావుగారు.

కార్యదర్శి ఎడ్వొకేటు సుబ్రహ్మణ్యంగారు.

పురప్రముఖుల్లో చాలమంది సంఘ సభ్యులు.

అచ్చు కిచ్చేశాం.

లాంఛనంగా చెప్పడానికి వచ్చాను. ఎదురు చెప్పకండి. ఇది శ్రీహరిరావుగారి చిరసంకల్పం.

కాదంటే- ఆయన నొచ్చుకుంటారు" అన్నారు.

నేను చకితుణ్ణయ్యాను.

కొంతసేపు మాట్లాడలేదు.

నెమ్మదిగా తేరుకని అన్నాను.

"మీరు తొందరపడ్డారు. మీకు ఊళ్ళో తగిన తోడ్పాటు రాదు. ఆపైని మీకూ నాకూ సన్మానం కంటె అవమానం ఎదురవుతుంది. ముఖ్యంగా నేనింకా కవి సన్మానాల స్థితికి ఎదగలేదు. కొన్ని రచనలు చేశాను. కొంత పేరుంది నిజమే. కాని వాటికి సన్మానం అనే పగటివేషం అక్కరలేదు. ఆదరంగా చదివితే - అదే తిరుగులేని సన్మానం. లోపల

ఇష్టపడుతూనే కవులు పైకి పెట్టే పోజులు అనుకోకండి. నిజం చెబు తున్నాను. దీనితో నా స్వేచ్ఛపోతుంది. సన్మానకర్తల ఇష్టానిష్టాలకు - తెలియకుండానే ఋణగ్రస్తుడిలా లొంగి తిరగవలసి వస్తుంది- అది నా కిష్టంలేదు. మన్నించండి. ఆ ప్రయత్నం వద్దు"

రామారావుగారు ముందు చిన్నబుచ్చుకుని తర్వాత గట్టిపడి అన్నారు. "శ్రీహరిరావుగారు- వెడుతూ- వెడుతూ, ఈపని నామీద పెట్టి వెళ్ళారు, ఉత్తరం మీద ఉత్తరం గుప్పిస్తున్నారు.

'రేంజి' ఉపాధ్యాయులంతా మీమీద ఇష్టంతో ఇప్పటికే 500/- రూపాయలు సిద్ధంచేశారు. ఇది వారి కోరిక- మా ప్రమేయమేమీ లేదు. వాళ్ళ ప్రయత్నాలకి మేం సహాయకులం మాత్రమే. చాలాదూరం వెళ్ళాం. ఇంక అడుగు వెనక్కి వెయ్యడానికి వీలులేదు. శ్రీహరిరావుగారు నాలుగు రోజులు సెలవు పెట్టి ఇక్కడ ఉంటున్నారు. ఆయనకోసం మీరు ఒప్పు కోవాలి. తప్పదు."

ఒప్పుకున్నాను.

ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

1959 ఫిబ్రవరి నెల అనుకుంటాను.

'రాజమండ్రి - కోటిపల్లి' రహదారి పక్క హైస్కూలు, వెనక భాగాన - చల్లని కొబ్బరితోటలో బ్రహ్మాండమైన పందిరివేసి అలంక రించారు. ప్రాథమికోపాధ్యాయ వార్షికోత్సవం అని పేరు పెట్టారు.

డిపార్టుమెంటు ఆఫీసర్లనందరినీ పిలిచి నాటి ఉదయం ఉపాధ్యాయ సమస్యలు చర్చించారు.

అది నిమిత్తమాత్రం——.

ఆ రంగు వేస్తే గాని 'అసోసియేషన్‌కు' కావలసిన డబ్బు రాదు.

సాయంత్రం సన్మానసభ— సాహిత్య ప్రసంగాలు—

చీకటి పడుతున్నది. దీపాలు వెలిగించారు.

సభ కన్నుల పండువుగా ఉంది.

దక్షారామ, రామచంద్రపుర, పుర ప్రముఖులు, ఉపాధ్యాయసంఘాలు, తదితర ప్రేక్షకులతో సభ నిండిపోయింది.

వేదికమీద తెల్లని పాలమీగడలాంటి పరుపులు పరచి, దిండ్లు అమర్చారు.

అధ్యక్షుణ్ణీ, వక్తలను, 'పెండ్లికొడుకును' వాటిమీద ఆసీనుల్ని చేశారు.

ముందు పెద్ద నాటకంతెర!

శ్రీహరిరావుగారు చేయూపారు.

తెర పైకి లేచింది.

పైన కనిపించకుండా కట్టిన కాగితపు బుట్టల్లోంచి జలజల పూలవాన కురిసింది.

నేను దక్షారామకావ్యంలో వర్ణించిన శ్రీనాథ సన్మానఘట్టం జ్ఞాపకం రావాలని రావుగారి పట్టుదల!

అధ్యక్షులు అమలాపురం కళాశాల పండితులు శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు ప్రారంభవచనాలు పలకగా- కార్యదర్శి సుబ్రహ్మణ్యంగారు సన్మానాన్ని ప్రశంసిస్తూ పెద్దలనుంచి వచ్చిన సందే

శాలు చదివారు. అందులో నాటి ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్, రాష్ట్ర మంత్రి శ్రీ కళావెంకట్రావు, కేంద్రమంత్రి శ్రీ గోపాలరెడ్డి, డా. టి. కనకరాజు వగైరా లౌకిక ప్రముఖులవీ, శ్రీవిశ్వనాథ, రాళ్ళపల్లి, మల్లంపల్లి, ప్రభృతి సాహిత్యనిష్ణాతులవీ, ఉన్నాయి.

గురువులు వజ్ఝలవారు, అకుండివారూ ఆశీస్సులు పంపారు.

పత్తిలు శ్రీ మధునాపంతులవారూ జమదగ్నిశర్మ గారూ కాళోజీ నారాయణరావుగారు నా దక్షారామకావ్యం గురించీ, సాహిత్య కృషిగురించీ, ప్రసంగించగా—

ప్రసిద్ధ నవ్యకవి శ్రీవేదుల మాట్లాడుతూ మీ రిచ్చిన ఈ రెండు వేలూ దక్షారామకావ్యంలోని —

“ముదిరిన గాంభీర్యముద్రలో ధర్మజు
పౌరుషగర్వ సత్త్వములు తొనకు”

అనే ఒక్క సీసపద్యానికి సరిపోతాయి, అని సభ్యుల నుద్దేశించి చమత్కరించారు.

చందన తాంబూలాదునాతో, సేలంపట్టుబట్టలతో, వెండిపళ్లెంలో ఉంచిన సన్మానద్రవ్యంతో, కార్యకర్తలు దక్షారామకవిని సత్కరించారు.

సన్మానం స్వీకరించిన కవి గద్గదకంఠంతో ఇట్లా సమాధానం చెప్పాడు.

“గౌరీ కోమల వల్లికాశ్రితము గంగా ఫేన పుష్పోత్కరం
బారక్త స్ఫుట జాటజూట కిసల వ్యాసక్త ముద్భాసి శా
ఖా రమ్యమ్ము కృపాల వాలము ఫలౌఘ త్యాగశీలమ్ము ద
క్షారామ స్థిత కల్పభూరుహము కాంక్షల్ దర్చు మా కెప్పుడున్.

కవినో, కథకుడనో సమీక్షా కుశలుడ—
నౌదునో కానొ; సహృదయులార! మీదు
నమృత సౌహృదబలము భీమయ్యకరుణ
వెలుగుచూపగ నడిపింప దలతు, కలము!

సభ రసవంతంగా ముగిసింది.

మెడలో దండలు తీస్తూ కవి అనుకున్నాడు.

'భీమయదేవుడు తన కీ సత్కారం చేయించి ఈ దక్షారామసీమ నుంచి వీడ్కోలు చెప్పడం లేదుగదా!' —

సరిగ్గా అట్లాగే జరిగింది—

వెంటనే లేదుగాని, మరి అయిదేళ్ళకు అమ్మగౌతమివద్ద సెలవు తీసుకొని పినతల్లి పినాకిని పిలుపు అందుకుని సింహపురి-సీమకురావడం తటస్థించింది.

కాశీఖండంలో—అగస్త్యుడు పనిమీద ఉత్తరం నుంచి దక్షిణానికి వచ్చి అనుకోకుండా అక్కడే స్థిరపడడం జ్ఞాపకం వచ్చి వస్తూంటుంది నాకు.

ఇతి

శివమ్

